సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 263 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5, సరాసరిన రూ.10 మేర పలికింది.

గరిష్టం/కనిష్టం 36.9°/9.3°

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి, మధ్యాహ్నం ఎండ తీవ్రత కొనసాగింది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

దాడితోటలో కేంద్ర బృందం సర్వే



మ్యాపు ఆధారంగా దాడితోట సమీపంలోని జలవనరులపై చర్చిస్తున్న శాస్త్రవేత్తలు

తాడిమర్రి: మండలంలోని దాడితోట గ్రామంలో కేంద్ర బృందం సర్వే నిర్వహించింది. బళ్లారిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ రీసర్చ్ సెంటర్‌కు చెందిన శాస్త్రవేత్తల బృందం గ్రామంలో ఇంటింటి సర్వే చేసింది. ఈ సందర్భంగా వారు గ్రామస్తుల స్థితిగతులు, జల వనరులు, భూములు, పంటలు, ఆదాయ వనరులపై వివరాలు సేకరించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. భౌగోళిక స్థితిగతులను తెలుసుకునేందుకు మ్యాప్ తీసుకుని గ్రామం చుట్టూ ఉన్న పొలాలు, కొండలు, గుట్టలు, నదులు తదితర అంశాలపై చర్చించారు. గ్రామం చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో సర్వే చేస్తున్నట్లు శాస్త్రవేత్తలు గ్రామస్తులకు వివరించారు. అయితే గతంలో దాడితోట గ్రామంపై విమానాలు, హెలీకాప్టర్లు చక్కర్లు కొట్టడం, అరుదైన లిథీలియం ఈ ప్రాంతంలో ఉన్నట్లు ప్రచారం జరగడంతో తాజా సర్వేపై గ్రామస్తులు రకరకాల ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నారు.

టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు: డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్, వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ తదితర లోయర్, హయ్యర్ టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి పరీక్షలో ఉత్తీర్ణులైన వారు లోయర్ గ్రేడ్ పరీక్షకు, గ్రేడ్ టెక్నికల్ పరీక్ష లేదా, లోయర్ గ్రేడ్ పరీక్షకు సమానమైన ఉత్తీర్ణత సాధించిన వారు హయ్యర్ గ్రేడ్ పరీక్షకు అర్హులన్నారు. 2023 ఏప్రిల్‌లో టెక్నికల్ అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు www.bse. ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని పూర్తి చేసిన వాటిని ఈ నెల 25లోపు కొత్తచెరువులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై దాడి హేయం

ప్రశాంతి నిలయం: విద్యార్థి సంఘాల ముసుగులో ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై దాడికి పాల్పడటం హేయమని వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా నాయకులు కాడిశెట్టి శ్రీనివాసులు, పి.వి.రమణారెడ్డి, జంషీద్, రవీందర్‌రెడ్డి, ఇంద్రప్రసాద్, గంగాధర్‌రెడ్డి, నాగరాజు, జయరాంరెడ్డి ఖండించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు వీధి రౌడీల్లా ప్రవర్తించడం తగదన్నారు.

జెండా ఎత్తేశారు!

ప్రజాభిమానం కోల్పోయిన టీడీపీ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో చాప చుట్టేసింది. బరిలో దిగకుండానే ఓటమి ఒప్పుకుంది. టీచర్ స్థానం నుంచి అభ్యర్థిని కూడా నిలపలేక పోయింది. ఒంటేరుకు మద్దతు తెలిపి చేతులు దులుపుకుంది. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు..గెలవలేక అధికారులపై భౌతికదాడులకు దిగుతూ 'ఉనికి'పాట్లు పడుతోంది. అధినేత నిర్ణయాలతో దిక్కుతోచని తమ్ముళ్లంతా తలోవైపు దారి చూసుకుంటున్నారు.



గెలవలేక మద్దెల ఓడు!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి ఒప్పుకున్న టీడీపీ
- టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి అభ్యర్థిని బరిలోకి దింపని వైనం
- ఒంటేరు శ్రీనివాసరెడ్డికి మద్దతునిస్తూ ప్రకటన
- ఉనికి కోసం అధికారులపై దాడులు

కదిరి: టీడీపీకి ఎన్నికల భయం పట్టుకుంది. ఎన్నికలు ఏవైనా తమకు ఓటమి తప్పదని భావిస్తోంది. ఈ భయంతోనే గతంలో స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ప్రకటించింది. తాజాగా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ జెండా ఎత్తేసింది. ఓటమి తప్పదని తెలియడంతో అభ్యర్థులెవరూ ముందుకు రాకపోతే, పరువు దక్కించుకునేందుకు టీడీపీ కొత్తమార్గం ఎంచుకుంది. పశ్చిమ రాయలసీమ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ మద్దతుతో బరిలోకి దిగిన ఒంటేరు శ్రీనివాసరెడ్డికి తమ మద్దతూ ఇచ్చి తప్పించుకుంది. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు తాజాగా ఒక ప్రకటన విడుదల చేశారు. దీన్నిబట్టి ఎన్నికలకు మునుపే టీడీపీ ఓటమిని అంగీకరించిందని కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. ఇక పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం నుంచి టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున రామచంద్రారెడ్డిని బరిలోకి దింపుతున్నట్లు ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మూడు రోజుల క్రితం అధికారికంగా ప్రకటించారు. ఇదే ఎన్నికల్లో ఎస్టీయూ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి సైతం బరిలో ఉన్నారు. అలాగే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరికొంత మంది పోటీలో ఉన్నప్పటికీ రామచంద్రారెడ్డి, కత్తి, ఒంటేరుల మధ్యే త్రిముఖ పోరుసాగే అవకాశం ఉంది.

పచ్చపార్టీని పట్టించుకోని పట్టభద్రులు..

పట్టభద్రులు కూడా టీడీపీని పూర్తిగా పక్కన పెట్టారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ ద్వారా లక్షా 30 వేల పైచిలుకుమందికి ఉద్యోగాలు కల్పించారు. అలాగే వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేశారు. నియోజకవర్గానికో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు శిక్షణ ఇస్తూ ఉద్యోగాలు కల్పిస్తున్నారు. అందువల్లే పట్టభద్రులంతా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటనడుస్తున్నారు. చంద్రబాబు ఎన్ని హామీలిచ్చినా నమ్మే పరిస్థితి లేదంటున్నారు.

గెలిచేది ఎట్టా...?

పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం(ఉమ్మడి అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలు) పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనైనా ఉనికి చాటుకునేందుకు టీడీపీ ఆపసోపాలు పడుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి తనయుడు వెన్నపూస రవీంద్రారెడ్డిని వైఎస్సార్ సీపీ బరిలోకి దింపింది. ఈయనకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలందరి మద్దతు పుష్కలంగా ఉంది. ఈ క్రమంలోనే టీడీపీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని బరిలోకి దింపింది. ఈయనది వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం. 'ఆయనకు స్థానికంగానే పట్టు లేదు. గెలిచేది ఎలా?' అని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా అంటున్నారు. రాయలసీమలో 52 అసెంబ్లీ స్థానాలుంటే అందులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 49 చోట్ల గెలిస్తే టీడీపీ తరఫున చంద్రబాబు(కుప్పం),ఆయన బావ మరిది బాలకృష్ణ(హిందూపురం), పయ్యావుల కేశవ్(ఉరవకొండ)లు మాత్రమే గెలిచారు. ఈ నేపథ్యంలో టీడీపీ అభ్యర్థి గెలుపు ఎలా సాధ్యమంటున్నారు. కేవలం పార్టీ ఉనికి కోసమే ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు టీడీపీ నాయకులే అంటున్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థి వెన్నపూస గోపాల్‌రెడ్డిని గెలిపించుకుంది. ఇప్పుడు టీడీపీ ప్రతిపక్షంలో ఉండి కనీసం పోటీ కూడా చేయకపోతే పార్టీ కేడర్‌పై ఆ ప్రభావం బలంగా పడుతుందని, అందుకే నామమాత్రపు పోటీ చేస్తున్నట్లు టీడీపీ వర్గాలే చెబుతున్నాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసేందుకు ఎవ్వరూ ముందుకు రాలేదని, అందుకే భూమిరెడ్డిని బరిలోకి దింపినట్లు వారంటున్నారు. ఇదే ఎన్నికల్లో పీడీఎఫ్ తరఫున నాగరాజుతో పాటు మరికొంతమంది బరిలో ఉన్నారు.

టీచర్, పట్టభద్రుల ఓటర్ల వివరాలు ఇలా..		
జిల్లా పేరు	టీచర్ ఓటర్లు	పట్టభద్రుల ఓటర్లు
శ్రీ సత్యసాయి	3,199	43,007
అనంతపురం	5,461	67,665
కర్నూలు	5,364	61,684
నంద్యాల	4,402	54,803
వైఎస్సార్ కడప	7,358	81,187
అన్నమయ్య	1,932	20,461
మొత్తం	27,716	3,28,807

ఓటమి భయంతో బెదిరింపులు..

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి భయంతో టీడీపీతో పాటు మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు, వాటి అనుబంధ విద్యార్థి సంఘాల నాయకులు అధికారులపై బెదిరింపులకు దిగుతూ దాడులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి విధి నిర్వహణలో భాగంగా అనంతపురానికి విచ్చేసిన పాఠశాల విద్య ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డిపై వారు దాడికి దిగిన విషయం తెలిసిందే. అధికార పార్టీకి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆయనపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని బ్లాక్‌మెయిల్ చేశారు. ఆర్‌జేడీ ప్రతాప్ రెడ్డిపై జరిగిన దాడిని వైఎస్సార్ ఉపాధ్యాయ సంఘంతో పాటు వైఎస్సార్ విద్యార్థి విభాగం, ఇతర సంఘాల నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు.

ఆర్టీసీ డీఎంపై 'విజిలెన్స్' విచారణ

ధర్మవరం అర్బన్: అవినీతి ఆరోపణల నేపథ్యంలో ధర్మవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌పై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. కొందరు స్థానికులు డీఎంపై పలు అవినీతి ఆరోపణల చేస్తూ ఆర్టీసీ ఎండీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎండీ... ఈ విషయాన్ని ఈడీకి తెలియజేయగా, ఆయన విజిలెన్స్ అధికారులకు అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే శుక్రవారం విజిలెన్స్ అధికారి విజయ్‌కుమార్ ధర్మవరం వచ్చి ఆర్టీసీ డిపో ఉద్యోగులను విచారించారు. డీఎం వేధింపులు, అవినీతికి ఆరోపణలపై వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఇంకా రెండురోజులపాటు విచారణ కొనసాగనున్నట్లు ఆర్టీసీ ఉద్యోగుల తెలిపారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక

కదిరి టౌన్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్ శనివారం కదిరికి రానున్నారు. ఉదయం 8 గంటలకు ఆయన కుటుంబీకులతో కలిసి ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోనన్నారు. ఈ మేరకు సమాచారం అందినట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ వెల్లడించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రవర్తనా నియమావళిపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న అనంతపురం ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అనంతపురం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని ఇన్‌చార్జ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ఇన్‌చార్జ్ కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఏఎస్పీ నాగేంద్రుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈ నెల 23 వరకు ఉంటుందన్నారు. 24న స్క్రూటినీ నిర్వహిస్తామన్నారు. 27వ తేదీలోగా నామినేషన్ల ఉపసంహరణ చేసుకోవచ్చన్నారు. ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ స్టేషన్లను గుర్తించి అనుమతి కోసం ఎన్నికల కమిషన్‌కు పంపించామన్నారు. ఒక్కొక్క కేంద్రంలో 800 నుంచి 1,400 ఓట్లు ఉండేలా చూశామన్నారు. పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించనున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లేదా జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఎవరైనా ఉల్లంఘనకు పాల్పడితే వీడియో చిత్రీకరించి ఎన్నికల కమిషన్‌కు పంపిసామన్నారు. ఏఎస్పీ నాగేంద్రుడు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

రీ సర్వే వేగవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్

- జేసీ టీఎస్ చేతన్

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' పథకంలో భాగంగా జిల్లాలో చేపట్టిన భూముల రీ సర్వే వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆర్డీఓలు, తహసీల్దార్లు, డీఐఓఎస్, రీసర్వే డీటీలు, మండల సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... రీ సర్వేలో ఎలాంటి తప్పులు జరగడానికి వీల్లేదన్నారు. రీసర్వేలో భాగంగా గ్రౌండ్ టు థింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఓఆర్ఐ(ఆర్తో రెక్టిఫైడ్ ఇమేజ్) వచ్చిన 29 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉండగా, 3 గ్రామాల్లో మాత్రం విడుదల చేశారన్నారు. తక్కిన గ్రామాల్లోనూ మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. రీసర్వేలో ద్వారా వెలుగులోకి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, ఆర్డీఓలు భాగ్యరేఖ, తిప్పేంద్రనాయక్, రాఘవేంద్ర, తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రి సంతోషంగా జరుపుకోవాలి

- దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు
- ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్




పుట్టపర్తి అర్బన్: మహాశివరాత్రి పర్వదినాన్ని ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఓ ప్రకటనలో ఆకాంక్షించారు. జాగరణ, శివపార్వతుల కల్యాణం తదితర వేడుకలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాటికోటేశ్వరాలయం, హేమావతి మంజునాథ స్వామి దేవాలయం, మడకశిర చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయం, అగళి శంకరేశ్వరస్వామి దేవాలయం, ధర్మవరం కాశీ విశ్వనాథ స్వామి దేవాలయం, సుంకేపల్లి వీరనారప్ప స్వామి దేవాలయం, తిమ్మమ్మ మర్రిమాను నారాయణస్వామి దేవాలయాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు కూడా అనుమానితులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

'పోలీస్' అభ్యర్థులకు గ్రౌండ్ సిద్ధం..

పోలీస్ పరీక్షలకు (ఎస్ఐ, కానిస్టేబుల్) సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు జిల్లా పోలీసుశాఖ సాయంగా నిలిచింది. జిల్లాలోని అభ్యర్థులు ఈవెంట్స్ ప్రాక్టీస్ చేసుకునేందుకు పుట్టపర్తి సమీపంలోని పోలీస్ పరేడ్ గ్రౌండు సిద్ధం చేస్తోంది. పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లోని అభ్యర్థులకు ఈవెంట్స్ ప్రాక్టీస్ చేసుకోవడానికి అనువైన మైదానం లేనందు వల్ల ప్రశాంతిగ్రామం వద్ద ఉన్న పరేడ్ గ్రౌండును సిద్ధం చేసి ఈనెల 20వ తేదీ (సోమవారం) నుంచి అనుమతి ఇవ్వనున్నట్లు ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ తెలిపారు. పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా ఈవెంట్స్ ప్రాక్టీస్ చేయిస్తామన్నారు. జిల్లా నుంచి ఎక్కువ మంది అభ్యర్థులు పోలీస్ ఈవెంట్స్‌లో అర్హత సాధించాలన్నారు. రోజూ ఉదయం 6 నుంచి 8 వరకూ, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ పరేడ మైదానంలో 1,600 మీటర్లు, 100 మీటర్లు పరుగు పందెంతో పాటు లాంగ్ జంప్ ప్రాక్టీస్ చేయిస్తామన్నారు. పోలీస్ ఈవెంట్స్‌పై అభ్యర్థులకు మాక్ టెస్ట్ సైతం నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9442818958 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సర్వం సాయీశ్వరం



ఆత్మలింగోద్భవం అనంతరం లింగాన్ని భక్తులకు చూపుతున్న సత్యసాయి (ఫైల్)

> దేహంలో చైతన్యం ఉంటే అది శివం, చైతన్యం కోల్పోతే శవం. శివస్వరూపమైన చైతన్యాన్ని తనలో నిలుపుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి. ప్రతి జీవిలోనూ అంతర్లీనమైన లింగం ఉంటుంది. అది మానవునిలో అంతర్భాగమైన లోహం. శివస్వరూపమైన చైతన్యంతో ఆత్మలింగంగా ఉద్భవిస్తుంది.
> – సత్యసాయి బాబా

- సాయి భక్తుల శైవక్షేత్రం ప్రశాంతి నిలయం
- నేటి నుంచి శివరాత్రి పర్వదిన వేడుకలు
- దేశ విదేశాల నుంచి తరలివచ్చిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహా సమాధి



శైవక్షేత్రంగా భాసిల్లుతున్న సత్యసాయి జన్మస్థలం

ప్రశాంతి నిలయం: 'అందరినీ ప్రేమించు....అందరినీ సేవించు' అంటూ ప్రపంచ వ్యాప్తంగా భక్తులను సంపాదించుకున్న ఆధ్యాత్మిక జ్ఞాన దీప్తి సత్యసాయి...భక్తుల మదిలో సాయీశ్వరునిగా కొలువయ్యారు. అందువల్లే దేశ విదేశాల చెందిన భక్తులు అచంచలమైన భక్తిభావనతో ఎల్లలు దాటి ఏటా శివరాత్రి రోజున పుట్టపర్తికి చేరి ప్రశాంతి నిలయంలో జరిగే ఉత్సవాల్లో పాల్గొంటారు. గతంలో సత్యసాయి ప్రదర్శించే ఆత్మలింగోద్భవ ఘట్టాన్ని దర్శించుకుని భక్తిపారవశ్యం చెందేవారు. ఇప్పుడు సత్యసాయి పూర్వ బోధనలు వింటూ తరిస్తున్నారు.

అపురూపం... సాయి లింగోద్భవ దర్శనం

పుట్టపర్తి కేంద్రంగా 1950లో సత్యసాయి ప్రశాంతి నిలయాన్ని ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకూ ఏటా ప్రశాంతి నిలయం వేదికగా శివరాత్రి పర్వదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సత్యసాయిని శివస్వరూపంగా భావించే భక్తులు శివరాత్రి పర్వదినాన సత్యసాయి చెంతకు చేరి పూజలు నిర్వహిస్తారు. 1965 నుంచి ఏటా శివరాత్రి పర్వదిన వేడుకల్లో సత్యసాయి ఆత్మలింగోద్భవం జరిగేది. ఈ అపురూప ఘట్టాన్ని పరమపవిత్రంగా భావించే భక్తుల భారీగా తరలివచ్చే వారు.

అధ్యాత్మిక జ్ఞానాన్ని నింపే అఖండ భజన..

ప్రశాంతి నిలయంలో ఏటా జరిగే శివరాత్రి పర్వదిన వేడుకలు అఖండ భజనతో ప్రారంభమవుతాయి. 12 గంటల పాటు శివనామస్మరణతో నిరాటంకంగా సాగే అఖండ భజనలో పాల్గొనేందుకు భక్తులు ఉత్సాహం చూపుతారు. అఖండ భజనతో భక్తుడు నిత్య ఆధ్యాత్మిక చైతన్యవంతుడై శివస్వరూపుడుగా ముందుకు సాగుతాడని సత్యసాయి బోధించేవారు. అందువల్లే నేటికీ శివరాత్రి వేడుకలను అఖండ భజనతోనే ప్రారంభిస్తారు.

నాటి సత్యసాయి జన్మస్థలం.. నేటి శివక్షేత్రం

ఒక నాడు పుట్టపర్తిలో సత్యసాయి జన్మస్థలం... నేడు శివక్షేత్రంగా రూపుదిద్దుకుంది. శివుడే సత్యసాయిగా అవతరించాడని భావించిన భక్తులు సత్యసాయి జన్మించి పూరి పాకను శివక్షేత్రంగా మార్చి ఆలయాన్ని నిర్మించారు. శివరాత్రి వేడుకల్లో పాల్గొనేందుకు పుట్టపర్తికి వచ్చే భక్తులంతా తప్పనిసరిగా శివాలయాన్ని సందర్శించి అక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

నేడు శివరాత్రి వేడుకలు..

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ప్రశాంతి నిలయంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేడుకల్లో పాల్గొనేందుకు దేశ, విదేశాలకు చెందిన భక్తులు ఇప్పటికే ప్రశాంతి నిలయం చేరుకున్నారు. ఈ మేరకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఏర్పాట్లను పూర్తి చేసింది. సాయంత్రం 4.30 గంటలకు లింగాభిషేకంతో వేడుకలు ప్రారంభమవుతాయి. అనంతరం గతంలో సత్యసాయి శివరాత్రి రోజున చేసిన ప్రసంగాలను వినిపిస్తారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సత్యసాయి అఖండభజన ఆదివారం ఉదయం 6 గంటలకు మంగళహారతితో పూర్తవుతుంది.

ప్రార్థనా మందిరాల్లో ప్రచారం నిషిద్ధం

- ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి పక్కాగా అమలు
- జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య



నోడల్ ఆఫీసర్లతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ప్రార్థనా మందిరాలు, పవిత్ర స్థలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదని, అది కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ) పి. కొండయ్య తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కా అమలు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన జిల్లాలో ఏర్పాట్లన్నీ ఇప్పటికే పూర్తి చేశామన్నారు. జిల్లా పరిధిలో 21 మంది నోడల్ అధికారులుగా నియమించామన్నారు. మార్చి 13వ తేదీ జరిగే పోలింగ్ కోసం జిల్లాలో 54 కేంద్రాలను, ప్రతి కేంద్రానికి మైక్రో అబ్జర్వర్లనూ నియమించామన్నారు. మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టకూడదు..

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఏ రాజకీయ పార్టీ నాయకులైనా, అభ్యర్థులైనా జాతి, కుల మత, ప్రాంతీయ పరమైన విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రవర్తించకూడదన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టడం, బెదిరించడం కూడా నేరమన్నారు. ఒకరి స్థానంలో మరొకరిని ఓటరుగా పంపడం చేయరాదన్నారు. గడువు దాటాక ప్రచారం చేయ కూడదని, ఓటర్లను పోలింగ్ స్టేషన్‌కు తీసుకురావడం, తీసుకెళ్లడం కూడా ఎన్నిక నియమావళిని ఉల్లంఘించడమేనన్నారు. అనుమతి లేకుండా ఇళ్లపై జెండాలు ఎగురవేయడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించడం నిషేధమని డీఆర్‌ఓ తెలిపారు. ప్రచార సభలకు లౌడ్ స్పీకర్ల వినియోగించాలనుకుంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. పోలింగ్ రోజుకు 48 గంటల ముందే ప్రచారం నిలిపివేయాలన్నారు. కొత్త పథకాలు ప్రకటించరాదని, శంకుస్థాపనలు చేయరాదన్నారు. ఇవన్నీ గమనిస్తూ ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారులకు డీఆర్‌ఓ సూచించారు.

రెండో రోజు ఆరు నామినేషన్లు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రెండో రోజు శుక్రవారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ నామినేషన్లు స్వీకరించారు. పట్టభద్ర ఎమ్మెల్సీకి మల్లేష్ యాదవ్ (అనంతపురం జిల్లా), రామచంద్రుడు (నంద్యాల జిల్లా), నరసింహం (నంద్యాల జిల్లా), పవన్‌కుమార్ (వైఎస్సార్ జిల్లా), అమృతకుమార్ (కర్నూలు జిల్లా) స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. పీడీఎఫ్ మద్దతుతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి నామినేషన్ వేశారు.

ఖాద్రీశునికి వెండి మకర తోరణం విరాళం



కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి గర్భాలయం ముందు భాగంలో ఏర్పాటు చేసేలా 50 కేజీల వెండి మకర తోరణాన్ని బెంగళూరుకి చెందిన మంజునాథ్ దంపతులు విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఆలయ చైర్మన్ గోపాలక్రిష్ణ సమక్షంలో ఆలయానికి కానుకగా సమర్పించారు. మరోవైపు కదిరి కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంక్ డివిజినల్ మేనేజర్ వై.వి.రాంప్రసాద్‌రెడ్డి ఆలయ అధికారులకు ఆలయానికి ఎల్ఈడీ స్క్రీన్‌ను అందజేశారు.

మేఘనాథరెడ్డికి విమలాశాంతి పురస్కారం

అనంతపురం కల్చరల్: విమలాశాంతి సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏటా సాహితీ వేత్తలకందించే కథా సాహిత్య ప్రత్యేక పురస్కారాన్ని చిత్తూరు జిల్లాకు చెందిన యువ కథా రచయిత 'కలుంకూరి గుట్ట కథలు' సంకలన కర్త కే.వీ మేఘనాథరెడ్డికి అందించనున్నారు. ఈ మేరకు సీనియర్ రచయిత శాంతినారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎన్జీఓ హోమ్‌లో పురస్కార ప్రదానోత్సవం మానవతా తరిమెల అమరనాథ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందన్నారు. సీమ వ్యాప్తంగా పలువురు ప్రసిద్ధులైన రచయితలు, కవులు ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. సాహితీ అభిమానులు విచ్చేయాలని కోరారు.

అందుబాటులో 'నిమ్మ మొక్కలు'

బుక్కరాయసముద్రం: రంగాపూర్ నిమ్మ, వేరు కాండంపై అంటు కట్టిన చీనీ మొక్కలు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో రైతులకు అందుబాటులో ఉన్నాయని రేకులకుంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9618449951, 9133315989 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కొత్త ప్రాజెక్టులకు సీడీపీఓల నియామకం

జిల్లా పేరు	పాత ప్రాజెక్టులు	కొత్త ప్రాజెక్టులు
అనంతపురం	10	1
శ్రీసత్యసాయి	7	6
మొత్తం	17	7



అనంతపురంలోని ఐసీడీఎస్ కార్యాలయం

అనంతపురం సిటీ: ఐసీడీఎస్‌లో కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 17 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. జిల్లాల పునర్విభజన తరువాత అనంతపురం జిల్లాలో 10, శ్రీసత్యసాయి జిల్లాలో ఏడు ప్రాజెక్టులు చొప్పున వెళ్లాయి. మూడు దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ప్రాజెక్టులు కావడం, జనాభా పెరగడం, కొత్త ఊర్లు పుట్టుకొస్తుండడంతో పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టులను కూడా విభజించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. రెండు జిల్లాలకూ కలిపి కొత్తగా ఏడు ప్రాజెక్టులు వచ్చాయి. అనంతపురంలో ఒకటి, శ్రీసత్యసాయి జిల్లాలో ఆరు ప్రాజెక్టులను కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం ప్రాజెక్టుల సంఖ్య 24కు పెరగనుంది. ఇందుకు సంబంధించి ప్రాజెక్ట్ అధికారిణుల (సీడీపీఓలు) నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

వెబ్ కౌన్సెలింగ్ ద్వారా సీడీపీఓల నియామకం..

ఐసీడీఎస్ రాష్ట్ర స్థాయి అధికారులు శుక్రవారం సాయంత్రం రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టులకు సీడీపీఓల నియామకానికి సంబంధించి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏయే ప్రాజెక్టుకు ఎవరెవర్ని నియమించారనే సమాచారం ఆయా సీడీపీఓలకు వివరించినట్లు తెలిసింది.

అనంతలో ఇలా..

అనంతపురం అర్బన్, కంబదూరు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, కణేకల్లు, ఉరవకొండ, కూడేరు, గుత్తి, శింగనమల, తాడిపత్రి ఉన్నాయి. తాజాగా కూడేరు ప్రాజెక్టు రద్దు చేసి అనంతపురం రూరల్ ప్రాజెక్ట్‌ను కొత్తగా ఏర్పాటు చేయనున్నారు. నార్పలలో కూడా కొత్త ప్రాజెక్టు ప్రారంభిస్తారు.

శ్రీసత్యసాయి జిల్లాలో..

హిందూపురం, మడకశిర, ధర్మవరం, పెనుకొండ, చెన్నేకొత్తపల్లి, కదిరి తూర్పు, కదిరి పడమర ప్రాజెక్టులు పాతవి ఉన్నాయి. తాజాగా బత్తలపల్లి, నల్లచెరువు, ఓబుళదేవరచెరువు, సోమందేపల్లి, గుడిబండ, పుట్టపర్తి ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తారు. కదిరిలో రెండు ప్రాజెక్టులకు గాను ఒక ప్రాజెక్టునే కొనసాగిస్తారు. మిగిలిన ప్రాజెక్టులు యథావిధిగా కొనసాగుతాయి.

రెండ్రోజుల్లో నియామక ఉత్తర్వులు..

శుక్రవారం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించిన ఐసీడీఎస్ రాష్ట్ర స్థాయి అధికారులు.. ఏయే ప్రాజెక్టుకు ఎవరెవర్ని నియమించారనే వివరాలు ఆయా అధికారులకు మాత్రం వెబ్ కౌన్సెలింగ్‌లో తెలిపారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు అధికారికంగా సోమవారం లేదా మంగళవారం జారీ చేయనున్నట్లు ఐసీడీఎస్ అధికారులు 'సాక్షి'కి తెలిపారు.

యువకుడి దారుణహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ఈద్గా మైదానం సమీపంలో కుమ్మర మోపూరి (32) అనే యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మృతుడు మోపూరి పెనుకొండ మండల పరమేశ్వరపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఈద్గా మైదానం సమీపంలోని ముళ్ల పొదల్లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ముఖం, మోకాళ్లపై గాయాలు ఉండటంతో దుండగులు హత్య చేసి ముళ్ల పొదల్లో మృతదేహాన్ని పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే కొంతకాలంగా మోపూరికి భార్యతో గొడవలు ఉండేవని బంధువులు తెలిపారు. హత్యకు గల కారణాల పోలీసుల విచారణలో తేలియాల్సి ఉంది. ఎస్ఐ విజయ్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

తిమ్మమాంబ ఉత్సవాలు ప్రారంభం



అలంకరణలో తిమ్మమాంబ



రథాన్ని లాగి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

• వేడుకగా రథోత్సవం

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని గూటిబైలు గ్రామం తిమ్మమ్మమర్రిమాను వద్ద శుక్రవారం రాత్రి మహాశివరాత్రి జాగరణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించే ఉత్సవాలకు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు, కడప, చిత్తూరు జిల్లా, కర్ణాటక రాష్ట్రం నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. శుక్రవారం అమ్మవారి రథోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రథోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి హాజరయ్యారు. తిమ్మమాంబ ఆలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే రథాన్ని లాగి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు రథాన్ని తిమ్మమ్మ మర్రిమాను, దిగువగూటిబైలు, ఎగువగూటిబైలు గ్రామాల్లో అమ్మవారి రథాన్ని ఊరేగించారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటెరాము, సర్పంచులు విష్ణుమూర్తి, నాగమునీశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాగరణకు ప్రత్యేక ఏర్పాట్లు..

మర్రిమాను వద్ద మహాశివరాత్రి జాగరణకు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తున్న సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో చెక్కభజన, తిమ్మమాంబ జీవిత చరిత్ర, బుర్రకథ చెప్పించనున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదాన కార్యక్రమం, వైద్య సేవల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

కదిరి టౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో శుక్రవారం రాత్రి పోలీసులు 1.50 కేజీ గంజాయిని పట్టుకున్నారు. గంగులమ్మ, గంగాధర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ మధు తెలిపారు. గతంలోనూ వారిపై గంజాయి కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ప్రశాంతి నిలయం: సత్యసాయి విద్యాసంస్థలకు చెందిన ప్రశాంతి నృత్య బృందం నిర్వహించిన నృత్య ప్రదర్శన నయనానందకరంగా సాగింది. శుక్రవారం సాయంత్రం మహాశివరాత్రి పర్వదిన వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయిని, పరమేశ్వరున్ని కీర్తిస్తూ నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.



నృత్య ప్రదర్శన దృశ్యం

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



చెరువులో తేలియాడుతున్న మృతదేహం

సోమందేపల్లి: మండలంలోని కేతగాని చెరువు గ్రామ చెరువులో ఓ గుర్తు తెలియని మృతదేహం (40) లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం చెరువులో శవం తేలియాడుతుండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. చుట్టు పక్కన ఉన్న బొగ్గు పరిశ్రమలో పనిచేసే కార్మికుడిగా స్థానికులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



మృతుడు నవీన్

గుడిబండ: మండల పరిధిలోని ఎస్.ఎస్.గుండ్లు గ్రామానికి చెందిన వడ్డే నవీన్ (23) గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు... నవీన్ ఐదేళ్ల క్రితం బెంగళూరులో కర్ణాటక రాష్ట్రం హాసన్‌కు చెందిన అనితను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. 8 నెలల క్రితం నవీన్ భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఎన్నిసార్లు పిలిచినా ఇక్కడికే రా ఇక్కడే ఉందాం అని చెప్పింది. నవీన్... తల్లిని ఒంటరిగా వదలి వెళ్లలేక తాగుడుకు బానిసై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కదిరి వైస్ ఎంపీపీకి గాయాలు

బత్తలపల్లి: మండల పరిధిలోని పోట్లమర్రి గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్న ప్రమాదంలో కదిరి వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్‌తో పాటు ఆయన భార్య సునీత, కుమారుడు యశ్వంత్, మరో వాహనదారుడు మారెన్నలకు గాయాలయ్యాయి. ముష్టూరు వైపు నుంచి పోట్లమర్రి వైపు వస్తున్న వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, పోట్లమర్రి వైపు నుంచి ముష్టూరు వైపు వెలుతున్న మారెన్న ద్విచక్ర వాహనాలు పోట్లమర్రి సమీపంలో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్పగాయాలుకాగా స్థానికులు వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

రాయలసీమ, తెలంగాణ రెండు కళ్లు

అనంతపురం: రాయలసీమలోని చాలా బాణీలు తన పాటలకు స్ఫూర్తిగా నిలిచాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని భువనవిజయంలో ఎస్కేయూ తెలుగు విభాగం పూర్వ విద్యార్థి డాక్టర్ సిగిలిరేవు రామాంజినేయులు రచించి గానం చేసిన 'ఆకలికేకలు' పాట ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా గోరేటి వెంకన్న హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... రాయలసీమ ప్రజల్లో కష్టపడే మనస్తత్వం, అమాయకత్వం చాలా బాగా నచ్చాయన్నారు. ఇక్కడి ప్రజలు రాజకీయవాదులు కాదు.. చాలా నిజాయతీ పరులన్నారు. రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలు తనకు రెండు కళ్లన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి, డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారం సేకరించాలి

అనంతపురం సిటీ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మిషన్ అంత్యోదయ' సర్వేలో సమగ్ర సమాచారం సేకరించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, అనంతపురం డీఎల్‌డీఓ చిలంకూరు ఓబుళమ్మ, డీఎల్‌పీఓ సుమన జయంతి ఇతర అధికారులు హాజరయ్యారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని అందరూ డీఎల్‌డీఓలు, 63 మండలాల ఎంపీడీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఈఓపీఆర్‌డీలు, మెడికల్ ఆఫీసర్లు, వెలుగు ఏపీఎంలు, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సర్వేలో సూచించిన అన్ని అంశాల గురించిన సమగ్ర సమాచారం సేకరించాలని ఆదేశించారు. సర్వేలో వెనుకబడిన వారు తమ పని తీరు మార్చుకోవాలని.. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా స్థాయి అధికారులు

అనంతపురం, నెల్లూరు జట్ల విజయం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆర్డీటీ ఆధ్వర్యంలో జరుగుతున్న విన్సెంట్ ఫెర్రర్ వెటరన్ క్రికెట్ టోర్నీలో భాగంగా శుక్రవారం నిర్వహించిన మ్యాచుల్లో అనంతపురం ఆర్డీటీ జట్టు కడప జట్టుపై, నెల్లూరు జట్టు హైదరాబాద్ వెటరన్ క్రికెట్ అసోసియేషన్ జట్టుపై విజయం సాధించింది. అనంత క్రీడా గ్రామంలోని బీ గ్రౌండ్ క్రీడా మైదానంలో వెటరన్ క్రికెట్ మ్యాచులు నిర్వహించారు. క్రికెట్ పోటీలను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ పర్యవేక్షించారు. తొలి మ్యాచ్‌లో అనంతపురం ఆర్డీటీ వెటరన్ జట్టు, కడప వెటరన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి అనంతపురం జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం ఆర్డీటీ వెటరన్ జట్టు 15.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ప్రధాన క్రీడా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు వెటరన్ క్రికెట్ జట్టు, వెటరన్ క్రికెట్ అసోసియేషన్ హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 156 పరుగులు మాత్రమే చేసింది. దీంతో నెల్లూరు జట్టు 15 పరుగులతో విజయం సాధించింది.



తలపడుతున్న అనంతపురం, కడప జట్లు

ఎస్కేయూ క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఎస్కే యూనివర్సిటీ క్రికెట్ జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 3 వరకు బెంగుళూరులోని రెవా యూనివర్సిటీలో నిర్వహించే ఆల్ ఇండియా యూనివర్సిటీల సౌత్ జోన్ క్రికెట్ పోటీల్లో వారు ఎస్కేయూ క్రికెట్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. జట్టును ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులు విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. జట్టుకు మేనేజర్‌గా చంద్రమోహన్, కోచ్‌గా ప్రవీణ్‌కుమార్ వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్కేయూనివర్సిటీ క్రికెట్ జట్టు సభ్యులు

ఎస్కేయూ క్రికెట్ జట్టు..

అర్జున్ టెండూల్కర్, రోహిత్‌రోషన్, వినయ్, చంద్రశేఖర్, కౌశిక్, మొహమ్మద్ సోను, నరసింహులు, దత్తారెడ్డి, జయకృష్ణ, ప్రమోద్‌కుమార్, భార్గవ్, వెంకటేశులు నాయక్, సాదిక్, కుళ్లాయప్ప, రాజశేఖర్.